epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా
T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : ఆదివారం - సెప్టెంబర్ 03- 2023 - పేజీలు : 3

## జి 20 సదస్సుకు హాజరుకానున్న జో బైడెన్



**టీ మీడియా, సెప్టెంబర్ 2, వాషింగ్టన్ :** సెప్టెంబర్ 9-10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జి 20 సదస్సుకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరుకున్నారు. అయితే ఈ సదస్సు జరగబోయే రెండురోజుల ముందే జో బైడెన్ భారత్‌కి చేరుకోనున్నట్లు వైట్ హైస్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. సెప్టెంబర్ 8వ తేదీ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్, భారత ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొనున్నారని శ్వేతసౌథ ప్రకటన వెల్లడించింది. ఇక సెప్టెంబర్ 9-10 తేదీల్లో జరగనున్న జి - 20 సదస్సులో బైడెన్ పాల్గొనున్నట్లు వైట్ హౌస్ ప్రకటన తెలిపింది. కాగా, జి20 శిఖరాగ్ర సమావేశంలో స్వచ్ఛమైన ఇంధన పరివర్తన, వాతావరణ మార్పులతో సహా ప్రపంచ సమస్యల్ని పరిష్కరించడానికి జి 20 దేశాల భాగస్వాములతో కలిసి బైడెన్ చర్చించనున్నట్లు వైట్ హౌస్ ప్రకటన తెలిపింది.

## ఆదిత్య ఎల్ 1 మిషన్
# సక్సెస్



**టీ మీడియా, సెప్టెంబర్ 2, శ్రీహరికోట :** ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్ 1.. నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లింది. పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ ఆ శాటిలైట్‌ను మోసుకెళ్లింది. 125 రోజుల తర్వాత ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ .. ఎల్ 1 పాయింట్‌కు చేరుకోనున్నది. విజయవంతంగా పీఎస్ఎల్వీ సీ57 నుంచి ఆదిత్య వేరుపడింది. దీంతో మిషన్ సక్సెస్ అయినట్లు శనివారం ఇస్రో ప్రకటించింది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ 1 పాయింట్ దిశగా ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ తన ప్రయాణాన్ని మొదలుపెట్టినట్లు ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. సుమారు 1.04 నిమిషాల తర్వాత రాకెట్ నుంచి వేరుపడిన ఆదిత్య ఎల్ 1 కక్ష్యలోకి చేరింది. ఉదయం 11.50 నిమిషాలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. నిర్దేశిత కక్ష్యలోకి ఆదిత్య ప్రవేశించినట్లు ఇస్రో తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పేర్కొన్నది.

## విజయవంతంగా
# కక్ష్యలోకి ఆదిత్య ఎల్1

### - హర్షం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్



**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం 'ఆదిత్య ఎల్1' ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో అంతరిక్ష పరిశోధనా రంగంలో మరో కీలక మైలురాయిని దాటింది అని సీఎం పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా దేశ శాస్త్రవేత్తలు సాధిస్తున్న ప్రగతి, ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 స్పేస్‌క్రాఫ్ట్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్నది. విజయవంతంగా పీఎస్ఎల్వీ సీ57 నుంచి ఆదిత్య వేరుపడింది. దీంతో మిషన్ సక్సెస్ అయినట్లు ఇవాళ ఇస్రో ప్రకటించింది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్1 పాయింట్ దిశగా ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ తన జర్నీ మొదలుపెట్టినట్లు ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. సుమారు 1.04 నిమిషాల తర్వాత రాకెట్ నుంచి వేరుపడిన ఆదిత్య ఎల్1 కక్ష్యలోకి చేరింది. ఉదయం 11.50 నిమిషాలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. నిర్దేశిత కక్ష్యలోకి ఆదిత్య ప్రవేశించినట్లు ఇస్రో తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పేర్కొన్నది. ఎల్1 పాయింట్ దిశగా ఆదిత్యుడి సౌరయానం మొదలైనట్లు వెల్లడించింది.

## ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతం
## శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు



**టీ మీడియా, సెప్టెంబర్ 2,న్యూఢిల్లీ :** శనివారం ఉదయం 11.50 గంటలకు ప్రయోగించిన ఆదిత్య ఎల్ - 1 ప్రయోగం విజయవంతమైనదని ఇస్రో వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. 'చంద్రయాన్ -3 విజయం తర్వాత భారత్ తన అంతరిక్ష యాత్రను కొనసాగిస్తోంది. భారతదేశపు మొట్టమొదటి సోలార్ మిషన్ ఆదిత్య ఎల్-1 విజయవంతంగా ప్రారంభించినందుకు శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అభినందనలు. ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం విశ్వంపై మంచి అవగాహన పెంపొందించడానికి అవిశ్రాంతంగా శాస్త్రీయ ప్రయత్నాలు కొనసాగుతాయి.' అని మోడీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు., రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఇస్రో శాస్త్రవేత్తలని అభినందించారు. ఈ సందర్భంగా 'భారతదేశపు మొట్టమొదటి సౌర మిషన్ అయిన ఆదిత్య-ఎల్1 ప్రయోగం భారతదేశ స్వదేశీ అంతరిక్ష కార్యక్రమాన్ని కొత్త పథంలోకి తీసుకెళ్లే ఒక మైలురాయి సాధన. ఇది అంతరిక్షం, ఖగోళ దృగ్విషయాలను బాగా అర్థం చేసుకోవడానికి మనకు ఎంతగానో సాయపడుతుంది. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను నేను అభినందిస్తున్నాను. మిషన్ విజయవంతం అయినందుకు నా శుభాకాంక్షలు' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కెసిఆర్ఆదిత్య ఎల్ -1 విజయవంతమైనందుకు తెలంగాణ రాష్ట్ర సిఎం కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. పరిశోధనా రంగంలో ఇస్రో మరో కీలక మైలురాయిని దాటింది అని కెసిఆర్ పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా దేశ శాస్త్రవేత్తలు సాధిస్తున్న ప్రగతి, ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

**జగన్మోమన్‌రెడ్డి :**
ఆదిత్య ఎల్-1 ప్రయోగంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. భారతీయ అంతరిక్ష సాంకేతికతను మరింత ఎత్తుకు తీసుకెళ్లారంటూ ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారాయన.

## విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలకు
# పదును పెట్టాలి

### - తెలంగాణ గవర్నర్ తమిళసై
### - ఘనంగా ఎస్ఆర్ఎం 3వ స్నాతకోత్సవం
### - 883 మంది విద్యార్థులకు డిగ్రీలు




**టీ మీడియా, సెప్టెంబర్ 2, గుంటూరు, :** విద్యార్థులు తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలకు నిత్యం పదును పెడుతూ ఉండాలనీ, అప్పుడే అంతర్జాతీయంగా అన్ని రంగాల్లో నెలకొన్న పోటీతత్వాన్ని సమర్థంగా ఎదుర్కోగలరని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందరరాజన్ పేర్కొన్నారు. ప్రతి రోజూ కొత్త టెక్నిక్స్ నేర్చుకోవాలని సూచించారు. శనివారం జరిగిన ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవానికి డాక్టర్ తమిళసై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ వేదికపై పట్టభద్రులైన విద్యార్థులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలనుద్దేశించి ప్రసంగించారు. భావి భారతావనికి క్రమ శిక్షణ గల విద్యార్థులను అందిస్తోన్న అధ్యాపకులకు తాను మొట్టమొదటి నమస్కారాన్ని తెలియజేస్తున్నానన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని చూశాక తాను ఏపీలో ఉన్నానా, లేక ఫారిన్ కంట్రీలో ఉన్నానా అన్న సందేహానికి గురయ్యానన్నారు. యూనివర్సిటీ భవనాలను చూసి సంభ్రమాశ్చర్యానికి లోనైననట్లు పేర్కొన్నారు. తాను తెలంగాణలో 14 యూనివర్సిటీలకు చాన్సలర్ ననీ, ఎక్కడా ఈ తరహా అంతర్జాతీయ స్థాయి ఆడిటోరియంను చూడలేదన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు మౌలిక సదుపాయాలు ప్రధానమని పేర్కొంటూ, వర్సిటీ యాజమాన్యాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. అవకాశాలను సృష్టించుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కరోనా వ్యాప్తి సమయంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వ్యాక్సినేషన్ టెస్ట్ డ్రైవ్ కు ఎంతో సహకారం అందించిందనీ, ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు కొత్త లక్ష్యాలతో, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ సత్యనారాయణన్ ఇకపై ఛాన్సలర్ గా కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు జనరల్ నాలెడ్జిని కూడా పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఉజ్వల జీవన విధానానికి, దేశ ప్రగతికి దోహదపడే కలలను సాకారం చేసుకోవాలని డాక్టర్ సత్యనారాయణన్ పేర్కొన్నారు. అనంతరం శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేషమైన సేవలు అందించిన డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి, గౌరవ అధిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవం ప్రారంభం సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ ఆరోరా స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథి ప్రసంగం ముగిశాక 883 మంది విద్యార్థులకు డిగ్రీలు, బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. గవర్నర్ రాక సందర్భంగా జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ అరిఫ్ లు యూనివర్సిటీకి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రేమకుమార్, డీన్లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ విష్ణుపథ్, డాక్టర్ రంజిత్ థాపా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా
# వైఎస్ఆర్ వర్ధంతి సభ

### - నివాళులర్పించిన కుటుంబ సభ్యులు



**టీ మీడియా, సెప్టెంబర్ 2,ఇడుపులపాయ :** దివంగత ముఖ్యమంత్రి వైస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.. వైఎస్సార్ ఘాట్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సీఎం జగన్‌తో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతి, తల్లి విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు మంత్రులు, వైసీపీ నేతలు కూడా వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు.ఇక, అంతకుముందు ఈరోజు ఉదయం వైఎస్ షర్మిల ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. శుక్రవారమేఇడుపులపాయకుచేరుకున్నషర్మిల..ఈరోజుఉదయంతనతల్లివిజయమ్మతోకలిసివైఎస్సార్ఘాట్‌కు వెళ్లినివాళులర్పించారు.ఇదిలాఉంటే, వైఎస్సార్‌ను గుర్తుచేసుకుంటూ సీఎం జగన్ సోషల్ మీడియాలో భావోద్వేగంతో కూడిన పోస్టు చేశారు. "నాన్నా మీరు లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిది. భౌతికంగా మా మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరకాలం జీవించే లీడర్ మీరు. మీ పట్ల ప్రజలకున్న ప్రేమాభిమానాలు నాకు కొండంత అండగా నిలిచాయి. మీ ఆశయాలే సంక్షేమం, సమగ్రాభివృద్ధి లక్ష్యాల సాధనలో నన్ను చేయిపట్టి నడిపిస్తున్నాయి. వర్ధంతి సందర్భంగా మీకు ఘనంగా నా నివాళులు నాన్నా" అని సీఎం జగన్ పేర్కొన్నారు.

# మతాంతర పెళ్లికి అక్క నో

### - సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తిని హత్య చేసిన చెల్లె



**టీ మీడియా, సెప్టెంబర్ 2, కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సంచలనం సృష్టించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి (24) అనుమానాస్పద మృతి కేసు కొలిక్కి వచ్చింది. నిందితులను ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు.. అరెస్ట్ అయిన వారిలో దీప్తి సోదరి చందన, ఆమె స్నేహితుడు, డ్రైవర్‌గా భావిస్తున్న మరో వ్యక్తి ఉన్నారు.దీప్తి అనుమానాస్పద మృతి అనంతరం పారిపోయిన సోదరి చందన ఒంగోలు వైపు వస్తున్నట్లు సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టంగుటూరులో టోల్‌గేట్‌ను తప్పించుకుని ఆలకూరపాడు వైపు వెళ్లినట్లు గుర్తించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒంగోలులోని లాడ్జిలో వారిని పట్టుకుని జగిత్యాల పోలీసులకు అప్పగించారు. నిందితులను ఒంగోలు నుంచి జగిత్యాల తీసుకువచ్చి పోలీసులు విచారించారు.కోరుట్లలోని భీమునిదుబ్బకు చెందిన బంక దీప్తి గత నెల 29న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. ఆమె చెల్లెలు చందన అదృశ్యమైంది. దీప్తి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి చందన సహా మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.మ్యారేజ్ ప్లాన్‌లో భాగంగా.. అక్కకు వోడ్కా తాగించి చంపేసింది..

జగిత్యాల ఎస్పీ భాస్కర్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం %ా% కోరుట్లకు చెందిన బంక చందన 2019లో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కాలేజీలో బీటెక్ జాయిన్ అయింది. ఉమర్ షేక్ సుల్తాన్(25) అనే యువకుడు చందనకు వన్ ఇయర్ సీనియర్. చందన రెండేండ్లు డిటెయిన్డ్ అయింది. ఉమర్ వన్ ఇయర్ డిటెయిన్డ్ అయ్యాడు. ఆ తర్వాత ఇద్దరు క్లాస్‌మేట్స్ అయ్యారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారిందని ఎస్పీ పేర్కొన్నారు. అయితే ఉమర్ తో పెళ్లికి దీప్తితో సహా ఇంటిలోని వారంతా వ్యతిరేకించారు..అయినా చందన మ్యారేజ్ కోసం ప్లాన్ వేసింది. ఆగస్టు 28న కాల్ చేసి ఓ ఫంక్షన్ నిమిత్తం తమ పేరెంట్స్ హైదరాబాద్ వెళ్తున్నారు. ఇంట్లో తాను, అక్కనే ఉంటాం. ఇంట్లో మనీ, బంగారం ఉంది. అది తీసుకొని పోయి పెళ్లి చేసుకుంటే.. సెటిలవుతామని ఉమర్‌కు చందన చెప్పింది. ఆగస్టు 28న ఉదయం హైదరాబాద్ నుంచి కారులో బయల్దేరి 11 గంటలకు కోరుట్లకు ఉమర్ చేరుకున్నాడు. ప్లాన్‌లో భాగంగా వోడ్కా, బ్రీజర్ తెప్పించింది చందన. రాత్రి సమయంలో దీప్తి, చందన కలిసి వోడ్కా, బ్రీజర్ తాగారు. రాత్రి 2 గంటల సమయంలో ఉమర్‌కు మేసేజ్ చేయడంతో ఇంటి వెనుకాల కారు ఆపి ఇంట్లోకి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీస్తున్న సమయంలో దీప్తికి మెలకువ వచ్చి లేచింది. గట్టిగా అరిచింది. చందన తన వద్ద స్కార్ఫ్‌తో దీప్తి మూతికి, ముక్కుకు చుట్టింది. ఆమె సోఫా మీద పడిపోయింది. ఉమర్, చందన కలిసి ఆమె చేతులు కట్టేశారు. గట్టిగా అరవకుండా మూతికి ప్లాస్టర్ వేశారు. పది నిమిషాల తర్వాత దీప్తిలో చలనం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

**70 తులాల బంగారం, రూ. లక్షా 20 వేలతో పరార్..** అక్క అచేతన స్థితిలో ఉండిపోవడంతో ఇంట్లో ఉన్న ఒక లక్షా 20 వేల నగదు, 70 తులాల బంగారం బ్యాగులో వేసుకున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు దీప్తికి ప్లాస్టర్ తీసేసి వెళ్లారు. వోడ్కా తాగి చనిపోయినట్లు సీన్ క్రియేట్ చేశారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. ఉమర్ తల్లి, చెల్లి, బంధువుకు జరిగిన విషయం చెప్పి.. నగదు, బంగారంతో.. ముంబై, నాగ్‌పూర్ వెళ్లాలని చందన, ఉమర్ ప్లాన్ చేసుకున్నారు. అక్కడే పెళ్లి చేసుకుని, సెటిల్ అవ్వాలని అనుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో ఏ1 చందన, ఏ2 ఉమర్, ఏ3 సయ్యద్ అలియా, ఏ4 ఫాతిమా, ఏ5 హాఫీజ్‌గా చేర్చామని తెలిపారు. ఈ ఐదుగురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ భాస్కర్ తెలిపారు.

## పాకిస్తాన్ టు హైదరాబాద్ వయా ఉత్తరప్రదేశ్..

### -ఫయాజ్‌ను పట్టుకున్న పోలీసులు

వివరాలు.. 3



# బాల్క సుమన్ కి సంపూర్ణ మద్దతు

## – ఆర్కెపి రజక సంఘం





**టీ మీడియా, సెప్టెంబర్ 2, రామకృష్ణాపూర్ :** క్యాతనంపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధిలో, సంక్షేమ పాలనలో తనదైన శైలిలో ముందుకు దూసుకెళుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్ కే రానున్న ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దత్తు తో రామకృష్ణాపూర్ రజక సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. బాల్క సుమన్ ఆర్కేపి రజక సంఘం భవన నిర్మాణానికి స్థానిక లేనిన్ నగర్ లో రెండు గుంటల భూమితో పాటు భవన నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. శరవేగంగా భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. బీసీ బందు పథకంలో భాగంగా 18 మంది రజక సోదరులకు లక్ష రూపాయల చొప్పున లబ్ధి చేకూర్చారని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు బీసీ బంధు పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి బాల్క సుమన్ ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని చాకలి ఐలమ్మ సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్చార్జి గాండ్ల సమ్మయ్య, రజక సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# పవన్ అభిమానుల రక్తదాన శిబిరం



**టి మీడియా, సెప్టెంబర్ 2, హుజూర్ నగర్ :** హుజూర్ నగర్ లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన నియోజకవర్గం ఇన్చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు ,వారి అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామా నుంచి వారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్త దానం చేయడం జరుగుతున్నదని, సేకరించిన ఈ రక్తాన్ని తల సేమియా బాధితులకు బ్లడ్ డొనేట్ చేయడం జరుగుతుందని, పవన్ కళ్యాణ్ అంటే పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథం కలిగిన వ్యక్తిగా ప్రజా క్షేమమే ధ్యేయంగా ప్రజల మధ్యలో ఉండే నాయకుడని వారు తెలియజేశారు .
జనచైతన్య ట్రస్టు సభ్యులు పిన పరాళ్ళ వంశీ, పారా సాయి, శివ, కిరణ్ సాయి, రాంబాబు,జనసేన నుండి సరి కొప్పుల నాగేశ్వరరావు,జాని మీయా,రాంబాబు, నవీన్, మీరా, అందే శ్రీను, ల్యాబ్ శ్రీను, ప్రవీణ్, సాయి చరణ్, రాకేశ్ నాయుడు, అరవింద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు లు పాల్గొన్నారు.

# సమస్య ఎక్కడున్నా పరిష్కారాన్ని తన వంతు కృషి



**టీ మీడియా, సెప్టెంబర్ 2, నడిగూడెం :** ఎక్కడ ఏ సమస్య ఉన్నా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తన వంతు కృషి చేస్తు అందరి మన్నలు పొందుతు శభాష్ అనిపించుకుంటున్నాడు నడిగూడెం గ్రామానికి చెందిన యువకుడు సుధీర్. గత నెల రోజుల నుండి స్థానిక ఎస్బిహెచ్ ఎదురుగా ప్రధాన రహదారి పైన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజ్ కావడంతో రహదారి మొత్తం బురద నీరు చేరి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటువైపుగా ఎంతోమంది ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు స్థానికులు సుధీర్ కి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని తన వంతుగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా లీకేజ్ నీరుని పక్క కాలువకు మళ్ళించాడు. విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమ నాయకుడిగా రోడ్ల సమస్యలు విద్యార్థుల సమస్యల పైన హామీల గురించి అన్ని సమస్యల పైన నిరంతరం ప్రజల తరఫున పోరాడుతూ ఎంత పెద్ద సమస్య అయినా నేనున్నానంటూ ప్రజలకు భరోసానిస్తూ మండల అభివృద్ధి కోసం అనునిత్యం పోరాటం కొనసాగిస్తున్న సుదీర్ నీ మండల ప్రజలు స్థానికులు అభినందినిస్తున్నారు.

# ఎనిమిది మంది ఉగ్రవాదులు మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 2,బలోచిస్తాన్ :** గడచిన 24 గంటల్లో బలూచిస్తాన్‌లో వేర్వేరు ఆపరేషన్లలో పాకిస్తాన్ ఉగ్రవాద నిరోధక విభాగం (సిటిడి) ఎనిమిది మంది ఉగ్రవాదుల్ని హతమార్చినట్లు పాకిస్తాన్‌కు చెందిన ఎఆర్‌వై న్యూస్ అనే మీడియా సంస్థ శనివారం నివేదించింది. సిటిడికి అందిన సమాచారం మేరకు వాషుక్ జిల్లాలోని బసిమా పట్టణంలోని తహసీల్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఓ ఇంటిపై భద్రతా బలగాలు శుక్రవారం దాడి దాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు ఉగ్రవాదులు మృతి చెందగా, మరో ముగ్గురు తప్పించుకున్నారని పాకిస్తాన్ మీడియా సంస్థ అవుట్‌లెట్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం సిటిడి స్వాధీనం చేసుకుందని ఎఆర్‌వై న్యూస్ సంస్థ తెలిపింది. క్వెట్టాలో శుక్రవారం జరిగిన మరో ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. ఒక బిడ్డను ముగ్గురు ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారని అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు స్థావరానికి చేరుకుని.. చిన్నారిని సురక్షితంగా కాపాడారని, ఈ ఆపరేషన్‌లో ఆ ముగ్గురి ఉగ్రవాదుల్ని చంపినట్లు సిటిడి ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. ఉగ్రవాదుల రహస్య స్థావరం నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని సిటిడి ప్రతినిధి అవుట్‌లెట్‌కి తెలిపారు.

# గడప గడపకు ఓజో ఫౌండేషన్ సేవలు



**టి మీడియా, సెప్టెంబర్ 2, హుజూర్ నగర్ :** సూర్యాపేట జిల్లా,హుజూర్ నగర్ మండలం గోపాలపురం గ్రామంలోని యస్సి కాలనీ సోదరులు నిర్మించుకున్న సత్తెమ్మ , ముత్యాలమ్మ దేవతల విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమనికి హుజూర్ నగర్ కాబోయే ఎమ్మెల్యే పిల్లుట్ల రఘు హాజరు కావాలిసి ఉండగా ,రఘు అందుబాటులో లేకపోవడం తో రఘు ఆదేశాల మేరకు వారి తండ్రి ఓజో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు పిల్లుట్ల వీరయ్య, ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇంఛార్జి కుక్కల వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న అన్ని కులాల వారు కలిసి చేసుకునే పండగ ప్రతి గ్రామంలో కూడా సత్తెమ్మ ముత్యాలమ్మ పండగలు జరుపుకుంటారు. సన్నాయి మేళాలతో వేడుకలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భారీ ఊరేగింపుతో ర్యాలీ నిర్వహించి సంబరంగా జరుపుకోవడం, మాకు ఘనంగా స్వాగతం పలకడం చాలా సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో రఘు అన్న కు ఒక్క అవకాశం ఇచ్చి చూడండని, మీ భవిష్యత్తు మార్చి చూపిస్తాడు అని అన్నారు. తధానంతరం అన్నదానం కార్యక్రమం లో పాల్గోన్నారు అందరు కూడా కలిసి కట్టుగా ఉండి ఈ కార్యక్రమన్ని ఇంత సక్సెస్ చేసినందుకు అందరికి పత్యేక ధన్యవాదములు తెలిపినారు ఈ కార్యక్రమం తదనంతరం హుజూర్ నగర్ లక్ష్మి నరసింహ ఫౌంక్షన్ హాలలో జరిగినా వివాహం లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ హుజూర్ నగర్ ఇంచార్జ్ కుక్కల వెంకన్న,కకునురి శివ రెడ్డి, మన్నెం వేణు, పాల్వాయి మధు,ఆవులపాటి శ్రీను,భూక్యా మహేష్ నాయక్, వానపట్ల నగరజు, పిల్లుట్ల సునీల్, తిరుపతి,వినయ్ గౌడ్, అనీల్ గౌడ్, నాగరాజు యాదవ్, మహేష్, జంగం నరేష్, రజాక్, రఫీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు చేయబడదు

## - కఠిన చర్యలు తప్పవు

## - తాహాసిల్దార్ వనజ రెడ్డి



**టీ మీడియా, సెప్టెంబర్ 2, జన్నారం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ వనజా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం రోజున తాహాసిల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం 370,374 సర్వే నంబర్ల మధ్యలో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టారని,ఆ నిర్మాణాన్ని శుక్రవారం రోజున రెవెన్యూ కార్యాలయసిబ్బంది రోజు వారి విధులలో భాగంగానే అక్రమ నిర్మాణ కట్టడాన్ని తొలగించడం జరిగిందని,అది గుడికి సంబందించినట్టు ఇక్కడ ఎటువంటి వివరాలు నమోదు కాలేదని,అక్కడ నిర్మాణం కూడా నాలుగు పిల్లర్లు,స్లాబ్ వేసి వుందని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని పక్క తోవ పట్టిస్తు అనేక వార్తలు వస్తున్నాయని ప్రభుత్వ భూమి లో ఎక్కడ అక్రమ కట్టడాలు జరిగిన వాటి పై చట్ట పరమైన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

# గంగమ్మ తల్లీ ఆశీసులు ప్రతీ ఒక్కరికీ కలగాలి



**టీ మీడియా, సెప్టెంబర్ 2, నడిగూడెం :**
సంస్కృతి సాంప్రదాయాలకు తెలంగాణ రాష్ట్రం నిలయమని కోదాడ అభివృద్ధి ప్రధాత , శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం నడిగూడెం మండలం శ్రీరంగాపురం గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయ శంకుస్థాపన మహోత్సవానినికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ గుడులను పట్టించుకున్న నాథుడే లేరన్నారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రాంతాలు, వర్గాల వారీగా నిర్మించే ప్రతి దేవాలయానికి ప్రభుత్వ ప్రాధాన్యత లభించింది అన్నారు. మతాలకు అతీతంగా ప్రభుత్వమే కార్యక్రమాలు నిర్వహించడం అనేది తెలంగాణ లో మినహా మరెక్కడా లేదన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని గంగమ్మ తల్లిని వేడుకున్నారు. దేవాలయాల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన తెలిపారు. దేవాలయానికి నిర్మాణానికి తన వంతు సహకారం ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొసుల రాజేష్, టిఆర్ఎస్ నాయకులు యాతాకుల మధు బాబు, గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు బండారు గురవయ్య, గ్రామ పెద్దలు, యాదవ సంఘం నాయకులు నాగలక్ష్మి, సైదులు, వెంకన్న, లింగయ్య, నరేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

# 'జెట్ ఎయిర్‌వేస్' వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ అరెస్ట్



**టీ మీడియా, సెప్టెంబర్ 2,ముంబై:** జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్(74)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు శుక్రవారం రాత్రి ముంబైలో అరెస్టు చేశారు. ఆయనను అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఇడి అరెస్టు చేసింది. నరేశ్ గోయల్ జెట్ ఎయిర్‌వేస్ కోసం కెనరా బ్యాంక్ నుంచి 848.86 కోట్ల రుణాలను తీసుకున్నారని, అందులో 538.62 కోట్లను బ్యాంక్‌కి చెల్లించలేదని కెనరా బ్యాంక్ ఫిర్యాదు మేరకు గోయల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. బ్యాంక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిబిఐ గోయల్ డబ్బుల్ని స్వాహా చేసినట్లు నిర్ధారించింది. ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఇడి గోయల్‌ని ప్రశ్నించి అరెస్టు చేసింది. గోయల్‌ని శనివారం ముంబైలోని పిఎంఎల్ఎ కోర్టు ముందు ప్రవేశపెట్టి.. ఇడి అధికారులు ఆయనను కస్టడీ కోరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి., మోసం, నేరపూరిత కుట్ర, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన, నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని పేర్కొంటూ నరేశ్ గోయల్, అనితా గోయల్, గౌరంగ్ ఆనంద శెట్టి తదితరులపై గతేడాది నవంబర్ 11న సీబీఐకి కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ పీ సంతోష్ ఫిర్యాదు చేశారు. దీనివల్ల బ్యాంకుకు రూ.538.62 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు.

# స్పా ముసుగులో వ్యభిచారం



**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్:** నగరంలో స్పాలు, మసాజ్ సెంటర్ల పై సిఎస్ పోలీస్ యాంటీ ట్రాఫికింగ్ సెల్ స్పెషల్ మెరుపు దాడులకు దిగింది. సీసీఎస్ టీమ్‌తో కలిసి బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్‌లో యాంటీ ట్రాఫికింగ్ సెల్ స్పెషల్ ఆపరేషన్ నిర్వహించింది..శనివారం బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ లో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. మసాజ్ సెంటర్లపై యాంటీ ట్రాఫికింగ్ సెల్ దాడులు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు, క్రాస్ మసాజ్ లకు పాల్పడుతున్నట్లు తేలింది. సీసీ కెమెరాలు లేకపోవడం.. రిజిస్టర్‌లో కస్టమర్ల వివరాలు రాయక పోవడం లాంటి ఉల్లంఘనలకు పాల్పడిన నిర్వాహకుల మీద కేసు నమోదు చేశారు. మేఘవి వెల్నెస్ స్పా, రువాన్ థాయ్ స్పా, సెన్సెస్ ట్రాంక్విల్ ది హెల్త్ స్పా, కానస్ లగ్జరీ స్పా, బోధి వెల్నెస్ స్పా సెంటర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

# ఉజ్వల ఫైనాన్స్ చైర్మన్ శ్రీధర్ అరెస్టు

## - మూడు కోట్ల రూపాయలు మోసం



**టీ మీడియా, సెప్టెంబర్ 2, రాజన్న సిరిసిల్ల:** అమాయక ప్రజల అవసరాలను బలహీనంగా భావించి కోట్లాది రూపాయలు దండుకున్న మోసకారిని పోలీసులు శనివారం అరెస్టు చేశారువేములవాడ పట్టణం మల్లారం రోడ్ లో ఉజ్వల త్రిఫ్ట్ క్రెడిట్ కోపరేటివ్ పేరుతో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల మొదలగు జిల్లాలలో అమాయక ప్రజలను మోసం చేశాడు. దాదాపు 1600 మంది పైగా అమాయక ప్రజలను ఆసరా చేసుకొని వారి వద్ద నుండి సుమారు మూడు కోట్ల రూపాయలు మోసం చేసిన ఫైనాన్స్ చైర్మన్ ను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్ కు తరలించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పట్టణ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజలు మోసపూరిత సంస్థలను నమ్మవద్దని సూచించారు. అనుమానిక సంస్థలు వ్యక్తులు తారస పడినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు...

# మెగా డీఎస్సీ కోసం నిరసన దీక్ష



**టీ మీడియా, సెప్టెంబర్ 2, జన్నారం:** మెగా డీఎస్సీ కోసం నిరసన దీక్ష నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర శనివారం రోజున ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి అజ్మత్ ఖాన్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అజ్మత్ ఖాన్ మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ప్రమోషన్లు, ఖాళీలను చూపించాలని అదేవిధంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రవేటు దీటుగా బలోపేతం చేయాలని, స్టూడెంట్ రేషియో కాకుండా సబ్జెక్టుల రేషియో ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని ఏ విధంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షుడు కామేర రాకేష్, జిల్లా నాయకులు వంశీ, అఖిల్, తిరుపతి, రఘువర్ధన్, దాసరి, గణేష్, బన్నీ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో పై కూలిన భారీ వృక్షం : డ్రైవర్ మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగింది. శనివారం మధ్యాహ్నం 1:22 గంటల సమయంలో.. హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే కాలనీలో ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో అక్కడే ఆగివున్న రెండు ఆటోలపై చెట్టు కూలడంతో.. ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఆ సమయంలో రద్దీ ఎక్కువగా లేకపోవడంతో భారీ నష్టం తప్పింది. రెండు ఆటోలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మృతి చెందిన ఆటో డ్రైవర్‌ను గౌస్ పాషాగా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా కూలిపోయింది. దీంతో అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చెట్టును డీఆర్ఎఫ్ బృందాలు రోడ్డు మీద నుంచి తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతించారు.

# అభిమానం చాటుకున్న డప్పు సతీష్




**టి మీడియా, సెప్టెంబర్ 2, హుజూర్ నగర్ :** హుజుర్నగర్ నియోజకవర్గం బి ఆర్ యస్ ఎమ్మెల్యే అభ్యర్థి గా శానంపూడి సైదిరెడ్డి ని మూడవ సారి ప్రకటించడంతో అప్పన్నపేట గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర స్థాయి డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ శానంపూడి సైదిరెడ్డి చిత్రపటాన్ని (పేపర్ కట్ చేసి ) ఎమ్మెల్యే కి ఇచ్చి అభిమానం చాటుకున్నారు. నాలుగేళ్లలో ఎనలేని అభివృద్ధి చేశారని , అందరికీ అందుబాటులో ఉన్న మన సైదన్న ను మళ్ళీ ఎమ్మెల్యే గా చూడాలనుకుంటున్నారని తెలియజేశారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన యువకుడు



**టీ మీడియా, సెప్టెంబర్ 2, గోదావరిఖని :** గోదావరిఖని పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కాసర్ల శిరీష అను గర్భవతి కి అత్యవసర చికిత్స నిమిత్తం శనివారం ఓ పాజిటివ్ రక్తం అవసరమని పేషెంట్ కుటుంబ సభ్యులు ఖుషి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ గుణ శేఖర్ సంప్రదించగా వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది. గుణ శేఖర్ ప్రతి 3 నెలలకి ఒకసారి రక్తదానం చేస్తూ ప్రాణధాతగా నిలుస్తున్నారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన గుణశేఖర్ ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,వాలంటరీ సభ్యులు,పేషంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టివేత





**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. రూ. 50 కోట్ల విలువైన 5 కిలోల కొకైన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్, ఢిల్లీ నుంచి డ్రగ్స్ తరలిస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. హ్యాండ్ బ్యాగ్‌లో బ్రౌన్ టేపు వేసి డ్రగ్స్ తరలిస్తుండగా, గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ డ్రగ్స్ తరలిస్తున్న వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేసి, శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

## తహసీల్దార్ కార్యాలయం ని
# తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**టీ మీడియా, సెప్టెంబర్ 2, ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం తహసీల్దార్ కార్యాలయ లో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ శ్యామ్ ప్రసాద్ సందర్శించిఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది. తనిఖీ లో భాగముగా రెవిన్యూ రికార్డ్స్ తనిఖీ చేసిన రికార్డ్స్ ను పరిశీలన చేశారు కార్యాలయం సంబంధించిన వివరాలు ను తహసీల్దార్ రాజేశ్వరి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ పైన జివో 58,59 పైన వివరణ అడిగి తెలుసుకున్నారు 125 చదరపు గజాల్లోపు స్థలాలను ఆక్రమించుకొని ఇండ్లు కట్టుకున్నవారికి ఉచితంగా క్రమబద్ధీకరణ అవుతుంది. ఇక 126 నుంచి 250 చదరపు గజాల వరకు ఆక్రమించినవా రు భూమి మార్కెట్ ధరలో 50 శాతం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. 251 నుంచి 500 చదరపు గజాల వరకు విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకున్నవారు మార్కెట్ ధరలో 75 శాతం ఫీజు చెల్లించాలి. 500 నుంచి 1000 గజాల వరకు ఉంటే ప్రభుత్వ ధరను వంద శాతం చెల్లించాల్సి ఉంటుంది. జివో -58: 125 చదరపు గజాల్లోపు స్థలాలను(ప్రభుత్వ స్థలం లో )ఆక్రమించుకొని ఇండ్లు కట్టుకున్నవారికి ఉచితంగా క్రమబద్ధీకరణ అవుతుంది. జివో - 59: 126 నుంచి 250 చదరపు గజాల వరకు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమించినవారు భూమి మార్కెట్ ధరలో 50 శాతం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. 251 నుంచి 500 చదరపు గజాల వరకు విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకున్నవారు మార్కెట్ ధరలో 75 శాతం ఫీజు చెల్లించాలి. 500 నుంచి 1000 గజాల వరకు ఉంటే ప్రభుత్వ ధరను వంద శాతం చెల్లించాల్సి ఉంటుంది. తహసీల్దార్ పద్మ, ఆర్ ఐ రాజి రెడ్డీ, ఆర్ ఐ 2 శ్రీధర్ జూనియర్ అసిస్టెంట్ మధను రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## పెద్దపల్లి ప్రజలు చల్లంగా ఉండాలి..

### - కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలి: ఎమ్మెల్యే దాసరి



**టీ మీడియా, సెప్టెంబర్ 2,తిరుమల:** తిరుమల (శ్రీ వెంకటేశ్వర స్వామివారిని పెద్దపల్లి ) ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న ఆయన శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగసాయి మండపంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయాలని, బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా ప్రభావం చూపాలని వేడుకున్నట్లు చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడాలని, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని మొక్కుకున్నట్లు తెలిపారు.

# కొటక్‌ను వీడిన ఉదయ్

### - ఎండీ, సీఈవో పదవులకు రాజీనామా



**టీ మీడియా, సెప్టెంబర్ 2, న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ రంగంలో విశేష అనుభవం కలిగిన ఉదయ్ కొటక్ అనూహ్యంగా కొటక్ బ్యాంక్ నుంచి వైదొలిగారు. శనివారం ఆయన మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. మరోవైపు, బ్యాంక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దీపక్ గుప్తా డిసెంబర్ 31 వరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గాను వ్యవహరించనున్నారు. ఉదయ్ కొటక్ పదవీ విరమణ కంటే నాలుగు నెలల ముందే ఆయన రాజీనామా చేయడం విశేషం. ఆయన రాజీనామాకు గల కారణాలు మాత్రం బ్యాంక్ వెల్లడించలేదు. కొన్ని నెలలు సమయం ఉన్నప్పటికీ ముందుగానే రాజీనామా చేశాను..ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రానున్నది. గత కొంతకాలంగా ఈ విషయంపై చర్చించి, ఇది సరైన సమయమని భావించి రాజీనామా సమర్పించాను అని ఉదయ్ కొటక్ బ్యాంక్ బోర్డుకు సమర్పించిన లేఖలో పేర్కొన్నారు. 985లో ముంబైలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ముగ్గురు ఉద్యోగులతో ప్రారంభమైన సంస్థ..ప్రస్తుతం లక్ష ఉద్యోగులను కలిగివున్నది. 38 ఏండ్ల క్రితం బ్యాంకులో రూ.10 వేలు పెట్టిన వారికి ఇప్పుడు రూ.300 కోట్ల రాబడిని సృష్టించింది. కొటక్ బ్యాంక్‌లో ప్రమోటర్ల వాటా 25.76 శాతం వాటా ఉండగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులకు 41.54 శాతం వాటా ఉన్నది. అలాగే దేశీయ సంస్థలకు 19.4 శాతం వాటా ఉన్నది. దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకైన కొటక్ బ్యాంక్‌లో ప్రస్తుతం లక్ష మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఎండీ, సీఈవో పదవలకు రాజీనామా చేసినప్పటికీ..బ్యాంక్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు.

**ఆర్బీఐ డెడ్‌లైన్ కంటే ముందుగానే..**

బ్యాంక్ యాజమాన్యంలో మార్పులు చేయాలని రిజర్వు బ్యాంక్ ఇచ్చిన గడువు కంటే ముందుగానే ఉదయ్ కొటక్ వైదొలగడం విశేషం. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం బ్యాంక్ ఎండీ, సీఈవోగా 15 ఏండ్లు మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది.

# మరాఠా కోటా ఉద్యమం ఉద్రిక్తం

### - వాహనాలకు నిప్పు, ధ్వంసం

### - మహారాష్ట్రలోని జాల్నా కేంద్రంగా కొనసాగుతున్న పోరు



**టీ మీడియా, సెప్టెంబర్ 2, ముంబై:** మరాఠా రిజర్వేషన్ల ఉద్యమం జోరుగా సాగుతున్నది. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ మహారాష్ట్రలోని జాల్నా జిల్లాలో గత ఐదు రోజులుగా సాగుతున్న ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. శనివారం అంబాద్ ప్రాంతంలో నిరసనకారులు ఓ లారీకి నిప్పుపెట్టారు. కొన్ని వాహనాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. దీంతో నిరసనకారులు రాళ్లు రువ్వడంతో జాల్నా ఎస్పీతోపాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో పోలీసులు గాలిలోకి రబ్బరు బుల్లెట్లను కాల్చారు. ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసుల వాహనాలను ధ్వంసం చేశారు. అయితే శుక్రవారం రాత్రి జరిగిన భారీ లాఠీచార్జిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. శివసేన నాయకుడు సంజయ్‌రౌత్ మాట్లాడుతూ 'నిరసనకారులు ఏ తప్పు చేశారని లాఠీచార్జి చేయాలని హెూంమంత్రి ఫడ్నవీస్ ఆదేశించారు' అని పేర్కొన్నారు. ఎన్సీపీ నేత శరద్ పవార్ స్పందిస్తూ సమస్యను సామరస్యంగా పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.'లాఠీచార్జి ఘటనపై దర్యాప్తునకు ఆదేశించాను' అని సీఎం ఏక్‌నాథ్ షిండే ట్వీట్ చేశారు. జల్నాలో హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 360 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

**ఏండ్లుగా సాగుతున్న పోరాటం**

విద్యా, ఉద్యోగాల్లో చాలా వెనుకబడ్డామని, తమకు రిజర్వేషన్లు కల్పించాలని మరాఠా ఉద్యమ నేతలు కొన్ని ఏండ్ల నుంచి పోరాడుతున్నారు. అధికార బీజేపీ మభ్యపెడుతున్నదని గ్రహించిన మరాఠాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.

## పేదలు ఆత్మగౌరవంతో
# బ్రతకాలనే డబుల్ బెడ్రూం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

టీ మీడియా, సెప్టెంబర్ 2, మేడ్చల్ మల్కాజ్‌గిరి : పేదలు గొప్పగా, ఆత్మగౌరవంతో బ్రతకాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అర్హులకు ఉచితంగా అందజేస్తుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శనివారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బహదూర్‌పల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రి శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు వివేక్, మాధవరం కృష్ణారావులతో కలిసి ప్రారంభించారు.ముందుగా కాలనీలో మంత్రి మొక్కలను నాటారు. బహదూర్‌పల్లిలో రూ. 76.50 కోట్ల వ్యయంతో 900 ఇండ్లు, డీ పోచంపల్లిలో రూ. 140 కోట్ల వ్యయంతో 1620, గాజుల రామారంలో రూ. 11 కోట్ల వ్యయంతో 144 ఇండ్ల సముదాయాలను నిర్మించారు. ర్యాండమైజేషన్ పద్దతిలో డ్రా నిర్వహించి సనత్ నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన 1700 మంది లబ్ధిదారులకు ఇండ్లను కేటాయిస్తూ మంత్రి పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఇల్లు కట్టి చూడు.. పెండ్లి చేసి చూడు అని మన పెద్దలు ఎప్పుడు చెబుతుంటారని, ఆ రెండు ఎంతో కష్టతరమైనవని అన్నారు. మన ముఖ్యమంత్రి ఒక వైపు ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తుండగా, మరో వైపు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ క్రింద లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్న గొప్ప మనసున్న మాహా రాజు అని పేర్కొన్నారు. ఈ ఇండ్లకు ముఖ్యమంత్రి డిజైన్ చేశారని చెప్పారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఆన్ లైన్ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. లబ్దిదారులపై ఒక్క పైసా భారం పడకుండా ప్రభుత్వమే అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్రూం రూమ్ ఇండ్లను నిర్మించి ఉచితంగా పంపిణీ చేస్తుందని చెప్పారు.గత ప్రభుత్వాలు పేదలకు పలు పథకాల కింద చేపట్టిన ఇండ్ల నిర్మాణాలలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం నామమాత్రమేనని, ఆ ఇండ్లు కూడా ఎంతో ఇరుకుగా ఉండేవని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఇల్లు ఎంతో విశాలంగా 2 బెడ్రూంలు, కిచెన్, హాల్, రెండు టాయిలెట్స్ ఉన్నాయని చెప్పారు. దేశంలో ఇంత గొప్ప కార్యక్రమం ఎక్కడా లేదన్నారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలనే సదుద్దేశంతో జీహెచ్ఎంసీ పరిధిలో 109 ప్రాంతాలలో రూ. 10 వేల కోట్ల వ్యయంతో లక్ష ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఇందులో 73 ప్రాంతాలలో 69,532 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 36 ప్రాంతాలలో 30,468 ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ ఇండ్లను దశల వారిగా అర్హులైన వారికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కొందరు దుర్మార్గులు ప్రజలను తప్పుదారి పట్టించే, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారి మాటలు పట్టించుకోవద్దని మంత్రి కోరారు.

మొదటి విడతలో జీహెచ్ఎంసీ పరిధిలోని 8 ప్రాంతాలలో ఈ ఒక్క రోజే ఒక్కో నియోజకవర్గంలో 500 మంది చొప్పున 11, 700 మందికి లబ్దిదారులకు ఇండ్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మొదటి విడతలో రానివారు ఆందోళన చెందవద్దని, దశల వారిగా



దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇస్తామని స్పష్టం చేశారు.

**ఆనందం వ్యక్తం చేసిన లబ్దిదారులు**

ఎన్నో సంవత్సరాల కోరిక సొంతింటి కల నేడు నెరవేరడంతో లబ్దిదారులు ఎంతో ఆనందించారు. ఇండ్ల కేటాయింపు పత్రాలను అందుకున్న పలువురు మహిళలు వేదికపైనే తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తమకు ఇల్లు ఉచితంగా నిర్మించి ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హౌసింగ్ సీఈ సురేష్, ఈఈ వెంకటదాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ టు హైదరాబాద్ వయా ఉత్తరప్రదేశ్..

### - ఫయాజ్‌ను పట్టుకున్న పోలీసులు

**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :** తన కొడుకును చుద్దామని పాకిస్తాన్ నుంచి అడ్డదారిలో ఇండియాలోకి చొరబడ్డాడు. హైదరాబాద్‌లో భార్య, అత్తమామలతో కలిసి ఉన్నాడు. అతడి వివరాలు బయటకు రాకుండా ఏడాది కాలంగా ఇంట్లోనే ఉన్నాడు. సమాచారం సేకరించిన బహదూర్‌పురా పోలీసులు పాకిస్తాన్ వాసి ఫయాజ్‌ను అరెస్టు చేశారు. భారత్‌లో ఉన్న అత్తామామల ప్రోత్సాహంతోనే అడ్డదారుల్లో ఇండియాకు వచ్చినట్లు పోలీసుల విచారణలో తెలిపాడు. సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్య శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

**ఇక్కడే పరిచయం..**

పాకిస్తాన్‌కు చెందిన ఫయాజ్ 2018లో షార్జాలోని సైఫ్‌జోన్ అనే సంస్థలో టైలర్‌గా పనిచేశాడు. అదే సమయంలో హైదరాబాద్ అసద్ బాబానగర్‌కు చెందిన నేహా ఫాతిమా షార్జాలో ఉంటూ టైలర్‌గా పనిచేసింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడి, ప్రేమగా మారింది. కొన్నాళ్లు సహజీవనం చేశారు. ఆమె గర్భవతి అని తేలడంతో 2020లో ఫాతిమా, ఫయాజ్ మహ్మద్ పెండ్లి చేసుకున్నారు. అదే ఏడాది నగరానికి వచ్చిన ఫాతిమా.. అసద్‌బాబానగర్‌లోని తన ఇంటిలో మగబిడ్డ (ఫైజాన్)కు జన్మనిచ్చింది. ఆ తర్వాత కొడుకును తన సవిత తల్లి వద్ద వదిలేసి.. తిరిగి షార్జాకు వెళ్లిపోయింది. అక్కడ ఫయాజ్, ఫాతిమా కలిసి ఉన్నారు.

**అత్తామామల ప్రోత్సాహం..**



గత ఏడాది ఆగస్టులో ఫాతిమా తిరిగి హైదరాబాద్‌కు రాగా, ఫయాజ్ పాకిస్తాన్‌కు వెళ్లిపోయాడు. ప్రస్తుతం వీరి కుమారుడు ఫైజన్‌కు మూడేండ్లు. కొడుకును చూడాలని ఉందంటూ.. ఫయాజ్ గత ఏడాది ఫాతిమా తల్లిదండ్రులతో చెప్పాడు. కొడుకును చూడటమే కాదు.. ఇక్కడే ఉండేందుకు ఏర్పాట్లు చేస్తామంటూ ఫయాజ్‌ను హైదరాబాద్‌కు రావాలని కోరారు.

**కర్మాండులో బస..**

గతేడాది అక్టోబర్‌లో టూరిస్ట్ వీసాపై నేపాల్ రాజధాని కర్మాండుకు ఫయాజ్ చేరుకున్నాడు. అప్పటికే కర్మాండుకు ఫాతిమా, ఆమె తల్లిదండ్రులు కొడుకును తీసుకొని వెళ్లి.. అక్కడ ఓ హోటల్‌లో బస చేశారు. 2022, నవంబర్ 12న అందరు కలుసుకున్నారు. వీరంతా ఉత్తర్‌ప్రదేశ్‌లో మహరాజ్‌గంజ్ జిల్లా సొనౌలి సరిహద్దు చెక్‌పోస్టు దాటారు. ఫయాజ్ చెక్‌పోస్టులో దొరకకుండా జాగ్రత్తలు తీసుకొని, అక్రమంగా అతడిని భారత్‌లోకి తీసుకొచ్చారు. రోడ్డు మార్గంలో హైదరాబాద్‌లోని ఇంటికి చేరుకున్నారు. కొంత కాలం అత్తామామలతో కలిసి ఉన్న ఫయాజ్ ఆ తర్వాత.. ఎన్ఎంగూడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కాపురం పెట్టాడు. ఫయాజ్ పాకిస్తాన్ నుంచి వచ్చే సమయంలో రూ. 5 లక్షల వరకు తీసుకొచ్చాడు. ఆ డబ్బును ఖర్చు చేస్తూ కుటుంబమంతా హాయిగా గడుపుతోంది. ఫయాజ్‌కు ఆధార్ కార్డు ఇప్పిస్తే.. ఇక్కడే ఉండి ఏదో ఓ పని చేసుకుంటాడని భావించిన అత్తామామలు అందుకు ప్లాన్ చేశారు. తన పేరు మహ్మద్ గౌస్ అంటూ మాదాపూర్‌లోని ఓ ఈ సేవ కేంద్రంలో గత మార్చి నెలలో ఆధార్ కార్డు కోసం ఫయాజ్ దరఖాస్తు చేసుకున్నాడు.

**ఉద్యోగం వేటలో బయటకొస్తే..**

ఈ క్రమంలోనే అతడు పాకిస్తాన్ నుంచి తెచ్చుకున్న డబ్బు అయిపోయింది. ఖర్చుల కోసం డబ్బు అవసరమై.. ఉద్యోగం వేటలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కొత్త వ్యక్తి ఎవరని ఆరా తీయగా.. విషయం తెలుసుకున్న బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్, డీఐ ఎన్. శ్రీశైలం బృందం ఫయాజ్‌ను పట్టుకున్నారు. దేశంలోకి అక్రమంగా చొరబాటు చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫయాజ్ సరిహద్దులు ఎలా దాటాడు.. అతడికి చెక్‌పోస్టులో ఎవరైనా సహకరించారా.. వారి పాత్రపై కూడా నగర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంబంధిత శాఖలకు లేఖలు రాస్తామని డీసీపీ తెలిపారు. ఇదిలాఉండగా.. ఫయాజ్ అత్తా మామలపై కూడా కేసు నమోదు చేశారు. వారు పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

# తెలంగాణలో మూడురోజులు భారీ వానలు

### - ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :** రాగల మూడు రోజుల్లో తెలంగాణవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పలుజిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.ఆదివారం నుంచి సోమవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని, పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వివరించింది.



# మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

**టీ మీడియా, సెప్టెంబర్ 2, హైదరాబాద్ :**న్యాయ వివాదాలను మధ్యవర్తిత్వంతోనే సత్వరం పరిష్కరించవచ్చని జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్ అన్నారు. న్యాయ ప్రక్రియ మానవీయతతో కూడినదై ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్ శివారుల్లోని శామీర్‌పేటలో శనివారం జరిగిన నల్సార్ యూనివర్సిటీ 20వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. న్యాయ వివాదాల పరిష్కారానికి నిరంతరం అధ్యయనంతోపాటు అనుభవా ల మేళవింపు ఉండాలని చెప్పారు. ఇందుకు సోక్రటిక్ పద్ధతి ఉత్తమమైనదని అభిప్రాయపడ్డారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఒక ప్రశ్నకు విద్యార్థుల నుంచి వేర్వేరు జవాబులు రాబట్టి వాటిని క్రోడీకరించటం సోక్రటిక్ పద్ధతి అని వివరించారు. రెచ్చగొట్టే రాజకీయ ప్రసంగాలు సోక్రటిక్ విధానం కాదని అన్నారు. ఇందులో భాగంగానే మధ్యవర్తిత్వ విధానం కీలకభూమిక పోషించగలదని చెప్పారు. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా వివాదాన్ని పరిష్కరించేందుకు మీడియేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

**న్యాయవాద వృత్తి సామాజిక బాధ్యత**

న్యాయవాద వృత్తి సామాజిక బాధ్యత అనే విషయాన్ని విస్మరించకూడదని జస్టిస్ సంజయ్ కౌల్ ఉద్బోధించారు. ఇందుకు అంబేద్కర్ రూపొందించిన గొప్ప రాజ్యాంగ విధానం దోహదపడుతుందని చెప్పారు. మానవ వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకుని పరిష్కారం చెప్పడమే న్యాయవ్యవస్థ ముందున్న విధి అన్నారు. న్యాయ విద్యాబోధన అనేక కొత్త పుంతలు




తొక్కుతున్నదని చెప్పారు. ఇప్పుడు కేస్ స్టడీలు, కోర్టుల్లో జరిగే కేసుల విచారణ పర్యవేక్షణ వంటి విధానాలు న్యా య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా నల్సార్ వర్సిటీలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని జస్టిస్ కౌల్ ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో వివిధ రకాల న్యాయ సహా యం, అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రం దోహదపడనుంది. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీ కృష్ణదేవరావు మాట్లాడుతూ.. యూ నివర్సిటీ అభివృద్ధికి తెలంగాణ ప్రభు త్వ సహకారం మరువలేనిదని చెప్పారు. కార్యక్రమానికి అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ హాజరయ్యారు. నల్సార్ వర్సిటీ చాన్స్‌లర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అధ్యక్షత వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు ప్రగతి నివేదిక సమర్పించారు. వేడుకగా జరిగిన ఊరేగింపునకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే విద్యుల్లతారెడ్డి నాయకత్వం వహించారు. సుమారు 1100 మంది పీజీ, డిప్లొమా విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. 58 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.

## లక్కీడిప్ ద్వారా ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక



**టీ మీడియా, సెప్టెంబర్ 2, జడ్చర్ల టౌన్ :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కావేరమ్మపేట వద్ద నిర్మించిన 120 డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులను శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ విడతల వారీగా ఉంటుందని అన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇండ్ల కేటాయింపులో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించిన తర్వాతే అర్హులను ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు.